సాక్షి నిజామాబాద్

గురువారం । 24 । జూలై । 2025



సీజనల్ వ్యాధులపై..

సీజనల్ వ్యాధులపై ప్రజలు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యం చేయొద్దని వైద్యారోగ్యశాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ అమర్‌సింగ్ అన్నారు.

- 8లో ▸



29 నుంచి ఎస్టీలకు..

కాంగ్రెస్ ఆదివాసీ విభాగం తరఫున రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎస్టీ సెల్ అధ్యక్షుడు బెల్లయ్య తెలిపారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.2 /24.1

వాతావరణం

ఉదయం శీతల గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఆర్మూర్ సబ్ కలెక్టర్‌గా అభిజ్ఞాన్ మాల్వియా

నిజామాబాద్ అర్బన్: ఆర్మూర్ సబ్ కలెక్టర్‌గా అభిజ్ఞాన్ మాల్వియా నియమితులయ్యారు. శిక్షణలో ఉన్న 2023 బ్యాచ్ ఐఏఎస్‌లను సబ్ కలెక్టర్‌లుగా నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే జిల్లాలో శిక్షణలో ఉన్న ఐఏఎస్ అజ్మీరా సంకేత్‌కుమార్‌ను నిర్మల్ జిల్లా భైంసాకు సబ్ కలెక్టర్‌గా నియమించారు.

పటాన్‌చెరు - ఆదిలాబాద్ రైల్వేలైన్ మంజూరు

సుభాష్‌నగర్: నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రైల్వే విస్తరణకు సంబంధించి మరో ప్రాజెక్ట్‌కు ముందడుగు పడింది. ఆర్మూర్ మీదుగా పటాన్‌చెరు – ఆదిలాబాద్ మధ్య కొత్త రైల్వేలైన్ వేయాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను పలుమార్లు కోరిన విషయం తెలిసిందే. తాజాగా ఈ ప్రాజెక్టు మంజూరైందని రైల్వే మంత్రి ఎంపీకి లేఖ రాశారు. డీపీఆర్ రూపొందిన తర్వాత తదుపరి చర్యలు చేపడతామని లేఖలో పేర్కొన్నారు. ఉత్తర తెలంగాణలో ముఖ్యమైన రైల్వేలైన్ మంజూరు చేసినందు కు ఎంపీ అర్వింద్ కేంద్రమంత్రికి బుధవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు.

పరిశ్రమల్లో తనిఖీలు



డొంకేశ్వర్(ఆర్మూర్): రైతులకు రాయితీపై అందిస్తున్న యూరియా పక్కదారి పట్టకుండా ప్రత్యేక టీములు రంగంలోకి దిగాయి. బుధవారం జిల్లాలోని పలుచోట్ల తనిఖీలు చేపట్టాయి. యూరియాను పలు పరిశ్రమల్లో వినియోగించే అవకాశం ఉండడంతో వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల వివరాల కోసం జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ ను ఫోన్లో సంప్రదించగా ఆయన స్పందించలేదు. జిల్లా కేంద్రంలో చేపట్టిన తనిఖీల్లో ఏవో మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ బాలరాజు, ఎస్సైలు ఉదయ్, గంగాధర్, ఆర్ఐ ప్రభాకర్ ఉన్నారు.

మత్స్య శాఖలో వసూళ్లపై ఆరా!

సాక్షి ఎఫెక్ట్..

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా మత్స్యశాఖలో వసూళ్ల తంతుపై నిఘా వర్గాలు ఆరా తీస్తున్నాయి. ఈ నెల 18, 23 తేదీల్లో 'సాక్షి'లో ప్రచురితమైన కథనాలపై ఉన్నతాధికారులు స్పందించి ఏడీ ఆంజనేయస్వామిని వివరణ కోరగా.. మరో పక్క నిఘా వర్గాలు లోతైన సమాచారాన్ని సేకరించి ప్రభుత్వానికి నివేదించాయి. ఏసీబీ సైతం మత్స్యశాఖపై నిఘా పెట్టినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇదిలా ఉండగా బైలా పేరుతో వసూళ్లు, ముడుపులిస్తేనే చెరువుల లీజు కథనాలు రాష్ట్ర మత్స్య శాఖ వర కు చేరాయి. వీటిపై వివరణ ఇవ్వాలని ఏడీ ని కమిషనర్ ఆదేశించారు. ఇటు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సైతం జవాబు రాసివ్వాలని ఏడీని అడిగినట్లు తెలిసింది. దీంతో ఆయన తనను తాను కాపాడుకునేలా వివరణ లేఖ ను కమిషనర్‌తోపాటు కలెక్టర్‌కు ఇచ్చినట్లు సమాచారం. పైగా మత్స్యకార సంఘాలపై నెపం వేసే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.



కనుచూపు మేర..

నిజామాబాద్ జిల్లాలోని మంచిప్ప నుంచి కామారెడ్డి జిల్లా గాంధారికి వెళ్లే మార్గంలో గల గుట్టల్లో సాగవుతున్న పంటలు కనుచూపు మేర పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. కొండలు, గుట్టలు నమ్ముకొని గిరిజనులు వ్యవసాయం చేస్తున్నారు. యాచారం తండా వద్ద సాగవుతున్న మొక్కజొన్న, పత్తి పంటలను 'సాక్షి' క్లిక్ మనిపించింది. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

● జిల్లాకు ఆరెంజ్ అలర్ట్



నిజామాబాద్ అర్బన్: జిల్లాలో రెండు రోజులపాటు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణకు అతి భారీ వర్ష సూచన ఉందని పేర్కొంటూ నిజామాబాద్ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. జిల్లాలో 20 సెంటీమీటర్లకు పైగా వర్షం కురిసే అవకాశం ఉందని ప్రకటించడంతో జిల్లా అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. లోతట్టు, నది పరీవాహక ప్రాంతాలు, వాగుల వద్ద జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖ అధికారులను కలెక్టర్ అప్రమత్తం చేశారు.

వాట్సాప్‌తో జాగ్రత్త

సైబర్ మోసానికి కాదేదీ అతీతం అనే పరిస్థితి వచ్చింది. ప్రస్తుత స్మార్ట్ ఫోన్ యుగంలో ప్రతి క్లిక్ విషయంలో అత్యంత అప్రమత్తంగా, జాగ్రత్తగా వ్యవహరించాల్సిన ఆవశ్యకత నెలకొంది. తాజాగా నిజామాబాద్ నగరంలో పలువురు వ్యక్తులు ఈ సైబర్ నేరగాళ్ల బారిన పడి నష్టపోయారు. ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన సైబర్ కేటుగాళ్లు నేరుగా స్థానిక వాట్సాప్ గ్రూపులను తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. మరోవైపు ఏకంగా బాధితుల పర్సనల్ ఫోన్ కాంటాక్ట్ నంబర్ల ద్వారా, బాధితుల బంధువులు, స్నేహితులతో నేరుగా చాటింగ్‌లోకి వెళ్తున్నారు. ఇలా హ్యాక్ చేసిన ఫోన్‌ను తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు.

- ఓ మాజీ ప్రజాప్రతినిధి వాట్సాప్ హ్యాక్
- అతడి బంధువులు, స్నేహితులు 90 మందితో చాటింగ్
- ముగ్గురి నుంచి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్న వైనం
- ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన అమాయకుల ఖాతాలను ఉపయోగించి సైబర్ నేరాలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఈజీ మెసేజింగ్, ఆడియో, వీడియో కాల్స్‌కు ఎంతో సౌకర్యంగా ఉండే వాట్సాప్ యాప్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసిన ఘటన కలకలం రేపింది. మూడు రోజుల క్రితం నగరంలోని ఓ కీలకమైన మాజీ ప్రజాప్రతినిధి వాట్సాప్‌కు సైబర్ కేటుగాళ్లు ఓ లింక్‌ను పంపారు. సదరు ప్రజాప్రతినిధి ఉపయోగిస్తోంది ఆపిల్ ఐఫోన్ కాగా, ఫోన్‌లాక్‌తోపాటు అన్ని యాప్‌లు ఫేస్ ఐడీతో ఓపెన్ అవుతాయి. అయితే వాట్సాప్ కూడా అలా ఓపెన్ చేసి కొత్తగా వచ్చిన ఓ లింక్‌ను క్లిక్ చేశారు. వెంటనే వాట్సాప్‌తోపాటు ఫోన్‌లోని సిమ్ పూర్తిగా సైబర్ నేరగాడి ఆధీనంలోకి వెళ్లిపోయింది. దీంతో బాధిత ప్రజాప్రతినిధి ఎవరికీ ఫోన్ చేయలేని, ఎవరి వద్ద నుంచి ఫోన్‌కాల్స్ రిసీవ్ చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. కొద్దిసేపట్లోనే కేటుగాడు వాట్సాప్ ద్వారా ఆ మాజీ ప్రజాప్రతినిధి కాంటాక్ట్ నంబర్లలోని 90 మందితో చాటింగ్‌లోకి వెళ్లాడు. బంధువులు, స్నేహితులతో చాటింగ్ చేయడం మొదలుపెట్టాడు. అత్యవసరంగా రూ.42 వేలు కావాలంటూ మెసేజ్‌లు చేశాడు. ఆ మెసేజ్‌లు చూసిన వారిలో నుంచి ముగ్గురు వ్యక్తులు సదరు ప్రజాప్రతినిధి ఫోన్‌పేకు డబ్బులు పంపగా, ఈ డబ్బులు నేరుగా సైబర్ కేటుగాళ్ల ఖాతాల్లోకి చేరిపోయాయి. గంటలోపే అప్రమత్తమైన సదరు మాజీ ప్రజాప్రతినిధి తన సిమ్‌ను డీ యాక్టివేట్ చేయించడంతో సైబర్ కేటుగాళ్ల ఆపరేషన్ మోసానికి బ్రేక్ పడింది. డబ్బులు పంపిన ముగ్గురిలో ఇద్దరు హైదరాబాద్‌లో, ఒకరు నిజామాబాద్‌లో సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే నిజామాబాద్‌కు చెందిన ఆ మాజీ ప్రజాప్రతినిధి వాట్సాప్ ద్వారా సైబర్ నేరగాడు ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి భార్యకు, ఆయన మరో బంధువును సైతం డబ్బులు కావాలని అడిగాడు.

ఫిర్యాదు చేయాలి

నిజామాబాద్ ఏసీపీ రాజావెంకటరెడ్డి మాట్లాడుతూ సైబర్ మోసాలకు గురైనవారు తక్షణమే 1930 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. ఇలా ఫోన్ చేసిన వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులు సైబర్ కేటుగాళ్ల నుంచి ఏవిధంగా తప్పించుకోవాలనే విషయమై పూర్తి వివరాలను తక్షణమే వివరిస్తారని సూచించారు.

రూ.42వేలు, రూ.46వేలు, రూ.48వేలు..

సైబర్ కేటుగాళ్లు కిట్టిపార్టీ గ్రూపులు నిర్వహించుకునే ఉన్నత వర్గాలకు చెందినవారి వాట్సాప్ గ్రూపులను లక్ష్యంగా చేసుకుని నేరాలకు పాల్పడుతున్నారు. లింక్‌లు ఓపెన్ చేసేవారి వాట్సాప్‌తోపాటు ఏకంగా సదరు బాధితుడి సిమ్ చిప్‌ను రీడ్ చేసి పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. చాటింగ్‌లోకి వెళ్లి రూ.42వేలు, రూ.46వేలు, రూ.48వేలు మాత్రమే అడుగుతున్నారు. వాట్సాప్ చాటింగ్‌లో స్పందించినవారు ఎవరు ఫోన్ చేసినా కూడా బాధితుడికి చేరడం లేదు. ఇదిలా ఉండగా సిమ్‌ను ఆధీనంలోకి తీసుకుని కాల్ ఫార్వర్డింగ్ సైతం సైబర్ కేటుగాళ్లే తమకు డైవర్ట్ చేసుకుంటున్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లో చాలామంది ఇలాంటి సైబర్ స్కాం ద్వారా భారీగా డబ్బులు పోగొట్టుకున్నారు. ఇతర దేశాల్లో ఉంటున్న బాధితుల పిల్లలకు సైతం కేటుగాళ్లు చాటింగ్‌లోకి వెళ్లి భారీగా డబ్బులు కొట్టేస్తున్నారు. ఇదిలా ఉండగా సిమ్ సైబర్ నేరగాళ్ల ఆధీనంలో ఉన్న సమయంలో ఆపిల్ ఐఫోన్ ద్వారా ఫేస్‌టైమ్ కాల్ మాత్రం బాధితుడు చేసుకునే అవకాశం ఉండడం విశేషం.

యూపీలోని అడ్డా కూలీల బ్యాంకు ఖాతాలతోనే..

ఇటీవల తెలంగాణ పోలీసులకు ఈ తరహా మోసాలపై ఫిర్యాదులు అందగా వారు ఉత్తరప్రదేశ్‌కు వెళ్లారు. అక్కడ కొత్త విషయాలు వెలుగుచూశాయి. అడ్డా కూలీలుగా ఉంటున్న వాళ్లకు రూ.3వేల నుంచి రూ.5వేలు ఇచ్చి వాళ్ల ఆధార్ నంబర్, బ్యాంకు ఖాతా తీసుకుని సైబర్ నేరగాళ్లు ఈ స్మార్ట్ మోసాలకు వాడుతున్నారు. ఇలా ఒక్కో సైబర్ మోసానికి ఒక్కొక్కరిని వాడుతున్నారు. మన రాష్ట్రంలోని బాధితుల ఖాతాలను ఖాళీ చేస్తున్నారు.

డెలివరీ పార్సిల్ వచ్చిందని..

కొందరు ఆన్‌లైన్ షాపింగ్ చేసినప్పుడు సైతం సైబర్ కేటుగాళ్లు ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నారు. షాపింగ్ చేయనివారికి సైతం పార్సిల్ వచ్చిందని, బయట డెలివరీ బాయ్ వెయిట్ చేస్తున్నాడని, ఓటీపీ చెప్పాలని కేటుగాళ్లు అడుగుతున్నారు. ఇలా చెప్పినవారి కాల్స్‌ను సైతం ఫార్వర్డ్ చేసుకుంటున్నారు.

కాల్ ఫార్వర్డ్‌ను డిసేబుల్ చేయాల్సిందే..

సైబర్‌మోసగాళ్ల ఉచ్చుకు చిక్కకుండా స్మార్ట్ ఫోన్‌లు వాడుతున్న ప్రతిఒక్కరూ తమ ఫోన్‌లో కాల్ ఫార్వర్డింగ్‌ను డిసేబుల్ చేయాలి. అదేవిధంగా *# 406, * 21 *తో మొదలయ్యే నంబర్ల నుంచి ఫోన్లు వస్తే లిఫ్ట్ చేయొద్దని నిపుణులు చెబుతున్నారు. ఇక ## 002 #డయల్ చేస్తే కాల్ ఫార్వర్డింగ్ డీయాక్టివేట్ అవుతుందని సూచిస్తున్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



వీసీలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

- కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్: ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకాన్ని పెంపొందించాలని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. కలెక్టరేట్ నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీల పనితీరును వైద్యాధికారులతో సమీక్షించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వ్యాక్సినేషన్ వంద శాతం జరగాలని కలెక్టర్ సూచించారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ, జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనకు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులను నియంత్రించేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా విష జ్వరాలు సోకితే, పరిసర ప్రాంతాల వారికి కూడా రక్త పరీక్షలు నిర్వహించాలని, పారిశుద్ధ్య పనులు, ఫాగింగ్ పక్కాగా జరిగేలా చూడాలన్నారు. గురుకుల, వసతి గృహాల్లో విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని అన్నారు. మాతా శిశు మరణాలు సంభవించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సాధారణ కాన్పులు జరిగేలా కృషి చేయాలని తెలిపారు. అదనపు కలెక్టర్ అంకిత్, వైద్యారోగ్యశాఖ అదనపు డైరెక్టర్ అమర్‌సింగ్, డీఎంహెచ్‌వో రాజశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి అశోక్ పాల్గొన్నారు.

ముగిసిన విచారణ

- సిరికొండ పీహెచ్‌సీ ఉద్యోగుల డుమ్మా వ్యవహారం..
- ఉన్నతాధికారులకు అందిన నివేదిక
- ప్రాథమిక విచారణ అనంతరం సీహెచ్‌వో సస్పెన్షన్



మే 15న సాక్షిలో ప్రచురితమైన కథనం

నిజామాబాద్‌నాగారం: సిరికొండ పీహెచ్‌సీ ఉద్యోగులు పలువురు విధులకు హాజరుకాకుండా అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేస్తున్న వైనంపై 'సాక్షి'లో మే 15వ తేదీన 'విధులకు డుమ్మా.. రిజిస్టర్‌లో హాజరు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ వ్యవహారంపై వైద్యారోగ్యశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు సీరియస్‌గా స్పందించారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఆదేశాల మేరకు వైద్యారోగ్యశాఖ అడ్మినిస్ట్రేటీవ్ అడిషనల్ డైరెక్టర్ శశిశ్రీ మే నెల 17న సిరికొండ పీహెచ్‌సీకి వచ్చి విచారణ చేపట్టారు. నివేదికతో హైదరాబాద్‌కు వెళ్లారు. అప్పటి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో రాజశ్రీ సైతం విచారణ చేపట్టారు. ఆయా సందర్భాల్లో విచారణ సందర్భంగా డుమ్మా ఉద్యోగులకు ఎవరు సహకరిస్తున్నారు? ప్రతి నెలా ఎంత డబ్బు వసూలు చేశారు? ఏ ఉద్యోగి ప్రమేయం ఎంత వరకు ఉంది? అని క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ప్రాథమిక విచారణ అనంతరం విధులకు డుమ్మా కొడుతూ జీతం తీసుకుంటున్న సీహెచ్‌వో వెంకటరమణపై మే 27న సస్పెన్షన్ వేటు వేశారు.

చర్యలు ఎన్నడో..?

సమగ్ర విచారణ నివేదికను డైరెక్టర్ ఆఫ్ హెల్త్(డీహెచ్), ఉన్నతాధికారులతోపాటు జిల్లా కలెక్టర్‌కు డీఎంహెచ్‌వో అందజేశారు. ముగ్గురు ఉద్యోగుల ప్రమేయం ఉన్నట్లు విచారణలో తేలిందని విశ్వసనీయంగా తెలిసింది. విచారణ నివేదిక జిల్లా, రాష్ట్ర అధికారుల చెంతకు చేరిన నేపథ్యంలో బాధ్యులపై ఏవిధమైన చర్యలు తీసుకుంటారు అనే దానిపై చర్చ జరుగుతోంది.

ఉన్నతాధికారులకు విన్నవించాం



సిరికొండ పీహెచ్‌సీలో ఉద్యోగుల డుమ్మా వ్యవహారంపై సమగ్రంగా విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారుల కు పంపించాం. జిల్లా కలెక్టర్ మారడంతో మళ్లీ ఫైల్ పంపించడం జరుగుతుంది. తప్పు చేసిన వారిపై కచ్చితంగా చర్యలు ఉంటాయి. – రాజశ్రీ, డీఎంహెచ్‌వో

- రోజుకు రూ.1.50 కోట్ల ఆదాయం
- సమకూరిన ఆదాయం రూ.239.17 కోట్లు
- ఉమ్మడి జిల్లాలో ఆరు డిపోలు.. 581 బస్సులు
- ఘనంగా ఆర్టీసీ సంబరాలు

ఆర్టీసీకి మహాలక్ష్మి

రీజియన్‌లో రోజుకు 1.80 లక్షల మందికిపైగా మహిళల ప్రయాణం



ఖలీల్‌వాడి: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ఆర్టీసీకి లక్ష్మి కళ తీసుకొచ్చింది. మహిళా ప్రయాణికులతో ఆర్టీసీ బస్సులు కిటకిటలాడుతుండగా.. అదే రీతిలో సంస్థకు ఆదాయం సమకూరుతోంది! 200 కోట్ల జీరో టికెట్లు జారీ అయిన సందర్భంగా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బుధవారం ఉమ్మడి జిల్లాలోని అన్ని డిపోల్లో సంబురాలు నిర్వహించింది. కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డితోపాటు అదనపు కలెక్టర్లు సంబురాల్లో పాల్గొన్నారు.

ఎదురు చూపులు లేవు.. టార్గెట్ గండం లేదు

ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు గతంలో ప్రయాణికుల కోసం వేచి చూడాల్సి వచ్చేది. బస్సుల్లో సీట్లు భర్తీకాకపోవడంతో ప్రతినెల ఆర్టీసీకి నష్టం వచ్చేది. ఈ నేపథ్యంలో బస్సు డ్రైవర్, కండక్టర్‌కు రూట్‌లో కలెక్షన్ టార్గెట్ విధించేవారు. 'మహాలక్ష్మి' పథకం పుణ్యమాని ఇప్పుడు సంస్థకు ఆదాయం సమకూరుతుండడంతోపాటు డ్రైవర్లు, కండక్టర్లకు కలెక్షన్ టార్గెట్ గండం తప్పింది. ఆర్టీసీ బస్సుల్లో కెపాసిటీ కన్నా ఎక్కువ మంది ప్రయాణం చేస్తున్నారు. దీంతో ఆర్టీసీ లాభాల్లోకి చేరింది.

ఉమ్మడి జిల్లా రీయింబర్స్‌మెంట్

మహాలక్ష్మి పథకం 2023 డిసెంబర్ 9వ తేదీన ప్రారంభం కాగా, ఇప్పటి వరకు రీజియన్ పరిధిలో 5.84 కోట్ల మంది మహిళలు (జీరో టికెట్లు) బస్సుల్లో ప్రయాణించారు. దీని ద్వారా సంస్థకు రూ.239.17 కోట్ల ఆదాయం సమకూరింది. ఉమ్మడి జిల్లాలోని ఆరు డిపోల నుంచి 581 బస్సులు వివిధ రూట్‌లలో తిరుగుతాయి. మొత్తం 3లక్షలకు పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండగా అందులో 1.80లక్షల మంది వరకు మహిళలు ఉంటున్నారు. రోజుకు సుమారు రూ.1.50కోట్ల ఆదాయం సమకూరుతోంది.

టిక్కెట్ ప్రయాణికుల కోసం డీలక్స్, ఏసీ..

మహాలక్ష్మి పథకం ద్వారా బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే వారి రద్దీ పెరగడంతో చార్జీలు చెల్లించి బస్సుల్లో వెళ్లే వారి కోసం ఆయా రూట్‌లలో సంస్థ డీలక్స్ బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చింది. బస్సుల్లో టిక్కెట్ చెల్లించే వారికి సౌకర్యంగా ఉంటుంది. దీంతోపాటు హైదరాబాద్, బెంగళూర్ తదితర ప్రాంతాలకు ఏసీ బస్సులను అందుబాటులో ఉంచారు.

వీటిలో ప్రయాణించే మహిళలను లక్కీడిప్ కార్యక్రమం ద్వారా ప్రోత్సహిస్తున్నారు. టికెట్ తీసుకుని డీలక్స్ బస్సుల్లో వరంగల్, సిద్దిపేట్, కామారెడ్డి తదితర ప్రాంతాలకు ప్రయాణించే మహిళా ప్రయాణికుల సంఖ్య సైతం పెరిగింది.

మహిళల అభ్యున్నతికి కృషి

- ఆర్మూర్ ఆర్టీసీ సంబురాల్లో కలెక్టర్ టి వినయ్‌కృష్ణారెడ్డి

ఆర్మూర్ : మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. ఆర్మూర్ ఆర్టీసీ డిపోలో బుధవారం నిర్వహించిన సంబురాలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలువురు మహిళా ప్రయాణికులతోపాటు సంస్థ సిబ్బందిని సన్మానించారు. అలాగే ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య గణనీయంగా పెరగడంతో ఒక్క నిజామాబాద్ రీజియన్ పరిధిలోనే కొత్తగా 141 బస్సులను కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఉచిత ప్రయాణ సదుపాయాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్ఎం జ్యోత్స్న, ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, డిపో మేనేజర్ రవికుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, ప్రయాణికులు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో మహిళాప్రయాణికులతో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, ఆర్ఎం జ్యోత్స్న, అధికారులు

డబ్బులు మిగులుతున్నాయి



ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టడంతో నెలకు సుమారు రూ.2వేల వరకు ఆదా అవుతున్నాయి. ఆ డబ్బులను ఇంటి అవసరాలకు వినియోగిస్తున్నాను. ప్రయివేట్ రంగంలో జీతాలు తక్కువగా ఉంటాయి. బస్సు చార్జీలు తప్పడంతో కొంత వరకు కలిసి వస్తోంది. – ప్రజ్ఞాశర్మ, ప్రయివేట్ ఉద్యోగిని, మాధవనగర్, నిజామాబాద్

ప్రయాణ ఖర్చులు లేవు



ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ప్రయాణ ఖర్చులు మిగులుతున్నాయి. ప్రైవేట్ వాహనాలతో పోలిస్తే ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించొచ్చు. ఇప్పుడు చాలా బస్సులు అందుబాటులో ఉంటున్నాయి. – సరళ, ప్రయివేట్ ఉద్యోగి, జాన్కంపేట్, ఎడపల్లి

అందుబాటులో బస్సులు



రీజియన్ పరిధిలో మహాలక్ష్మి పథకం అమలు కోసం అవసరమైన బస్సులు అందుబాటులో ఉన్నాయి. అంతేకాకుండా టిక్కెట్ తీసుకుని ప్రయాణించే వారి కోసం డీలక్స్, ఏసీ బస్సులను అందుబాటులో ఉంచాం. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులను నడుపుతున్నాం. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాకు 141 బస్సులు వచ్చాయి. దసరా వరకు అదనంగా మరో 31 కొత్త బస్సులు వస్తాయి. మహిళలు ఆర్టీసీని సద్వినియోగం చేసుకోవాలి. – జ్యోత్స్న, ఆర్ఎం, నిజామాబాద్

క్లుప్తంగా

మహాలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఖలీల్‌వాడి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్‌ అంకిత్‌ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో రాష్ట్రవ్యాప్తంగా జీరో టిక్కెట్లతో 200 కోట్ల మంది మహిళలు ప్రయాణం చేసిన సందర్భంగా సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వచ్చి పనులు చేసుకునే వారికి ఈ పథకం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. అనంతరం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన మహిళలు, విద్యార్థులను అదనపు కలెక్టర్‌ అంకిత్‌తోపాటు డిప్యూటీ ఆర్‌ఎం మధుసూదన్‌ సన్మానించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్లు ఆనంద్‌, సాయన్న, మహిళలు, యువతులు తదితరులు పాల్గొన్నారు.

మోస్రాలో ఒకరికి డెంగీ



వర్ని (మోస్రా): మండల కేంద్రానికి చెందిన షేక్‌ జుబేర్‌కు డెంగీ ఫీవర్‌ వచ్చినట్లు మోస్రా మెడికల్‌ ఆఫీసర్‌ విజయకుమార్‌ వెల్లడించారు. బాధితుడి ఇంటి పరిసరాల్లో బుధవారం దోమల మందును పిచికారీ చేయించినట్లు తెలిపారు. ప్రజలు ఇంటి చుట్టుపక్కల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. మలేరియా సబ్‌ యూనిట్‌ అధికారి హక్తర్‌ హుస్సేన్‌, ఎంపీడీవో శ్రీనివాస్‌ పరిసరాలను పరిశీలించారు.

ఎస్సారెస్పీకి స్వల్ప ఇన్‌ఫ్లో

- 2,600 క్యూసెక్కుల వరద



బాల్కొండ: స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లోకి 2,600 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్ట్‌ నీటిమట్టం క్రమంగా పెరుగుతుంది. ప్రాజెక్ట్‌ నుంచి కాకతీయ కాలువ ద్వారా 100, మిషన్‌ భగీరథ ద్వారా 231,ఆవిరి రూపంలో 277 క్యూసెక్కుల నీరుపోతుంది. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి 1068.80(22.02 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

గతేడాది కంటే తక్కువే..

ఎస్సారెస్పీలో క్రితం రోజు వరకు ప్రస్తుత సంవత్సరం నీటి నిల్వ కంటే గతేడాది నీటి నిల్వ తక్కువగా ఉంది. కానీ, బుధవారం ప్రాజెక్ట్‌లోని నీటి నిల్వ కంటే గతేడాది ఎక్కువగా నమోదైంది. గతేడాది జూలై 22 నుంచి ఎస్సారెస్పీకి భారీ వరద ప్రారంభమైంది. 25 వేల క్యూసెక్కులతో ప్రారంభమై క్రమంగా పెరిగింది. జూలై చివరి నాటికి ప్రాజెక్ట్‌ నిండుకుండలా మారింది.

విద్యా సంస్థల బంద్‌ విజయవంతం



నిజామాబాద్‌అర్బన్‌: విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్‌ ప్రశాంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌డీఎస్‌ జాతీయ కన్వీనర్‌ రాజశేఖర్‌ మాట్లాడుతూ కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎన్నికల మెనిఫెస్టోలో విద్యార్థులకు పెద్దపీట వేస్తామని ప్రచారం చేసి, అధికారంలోకి రాగానే విస్మరించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా కార్యదర్శి రఘురాం, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌, గణేశ్‌, ఎస్‌ఎఫ్‌ఐ నగర అధ్యక్షుడు ఆజాద్‌, ఏఐపీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌, ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షుడు నాగరాజ్‌ పాల్గొన్నారు.

స్కానింగ్‌ సెంటర్లను తనిఖీ చేయండి

- వైద్యారోగ్యశాఖ అధికారులకు కలెక్టర్‌ ఆదేశం
- చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: వినయ్‌ కృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లాలోని స్కానింగ్‌ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేయాలని కలెక్టర్‌ టీ వినయ్‌ కృష్ణారెడ్డి వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తూ, చట్టాన్ని ఉల్లంఘించే సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌ హాల్‌లో బుధవారం కలెక్టర్‌ అధ్యక్షతన గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ, లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టంపై జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ అన్ని ప్రమాణాలు పాటిస్తూ అర్హతలు ఉన్న స్కానింగ్‌ కేంద్రాలకు మాత్రమే రిజిస్ట్రేషన్‌, రెన్యూవల్‌ చేయాలన్నారు. లింగ నిర్ధారణ చేస్తే పీసీపీఎన్డీటీ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. సెంటర్ల అనుమతులు రద్దు చేసి, అవసరమైతే సీజ్‌ చేయాలని స్పష్టం చేశారు. లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలను ప్రోత్సహించిన వారితోపాటు అందుకు సహకరించిన వారికి జైలు శిక్షతోపాటు జరిమానా విధించబడుతుందని తెలిపారు. ప్రతి స్కానింగ్‌ సెంటర్‌లో నిర్ణీత రుసుమును మాత్రమే వసూలు చేయాలని, చార్జీల వివరాలు తెలిపేలా పట్టికను ప్రదర్శించాలన్నారు. క్వాలిఫైడ్‌ డాక్టర్‌ రిఫరల్‌ స్లిప్పు లేనిదే మెడికల్‌ షాపుల్లో అబార్షన్‌ కోసం వాడే ఔషధాలను విక్రయించకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. లింగ నిర్ధారణ, భ్రూణ హత్యల నివారణకు ఉద్దేశించిన చట్టాలపై జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యపర్చాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్‌ అంకిత్‌, డీఎంహెచ్‌వో రాజశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్‌, ఐఎంఏ ప్రతినిధి డాక్టర్‌ శ్రీనివాస్‌, లీగల్‌ సెల్‌ ప్రతినిధి జీ రవిప్రసాద్‌, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మెనూ పక్కాగా అమలు చేయాల్సిందే



తిమ్మాపూర్‌ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం మెనూను పరిశీలిస్తున్న కలెక్టర్‌

మోర్తాడ్‌: ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని కలెక్టర్‌ టీ వినయ్‌ కృష్ణారెడ్డి పేర్కొన్నారు.విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మోర్తాడ్‌ మండలం తిమ్మాపూర్‌ గ్రామంలో ఒకే ప్రాంగణంలో ఉన్న జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ప్రధానోపాధ్యా యులు సమ్మిరెడ్డి, నిజాముద్దీన్‌లతో మాట్లాడారు. మెనూ ప్రకారం ఆహార పదార్థాలు లేకపోవడంతో ముందుముందు ఎలాంటి లోటు లేకుండా సరిచేయాలని ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న పాఠశాల అదనపు గదులను వెంటనే పూర్తి చేయాలని ఇంజినీరింగ్‌ విభాగం అధికారులను ఆదేశించారు.

ఏర్గట్లలో ఆస్పత్రి, సహకార సంఘం గోదాం..

ఏర్గట్ల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్‌ తనిఖీ చేశారు. వైద్యాధికారి, సిబ్బంది హాజరుశాతాన్ని పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఎలాంటి లోటు లేకుండా చూడాలని ఆదేశించారు. గర్భిణులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. అనంతరం సహకార సంఘం గోదాంను పరిశీలించి ఎరువుల నిలువలను తనిఖీ చేశారు. యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కలెక్టర్‌ వెంట మండల ప్రత్యేకాధికారి డీఎల్‌పీవో శివరామకృష్ణ ఉన్నారు.

బోరు వేయడానికి అనుమతి తప్పనిసరి

సమాచారం



ఖలీల్‌వాడి: బోరు బావి వేయడానికి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. సాగునీటికి సంబంధించిన చట్టాల్లో ప్రధానమైనది వాల్టా చట్టం 2002(వాటర్‌, ల్యాండ్‌ అండ్‌ ట్రీస్‌). ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈ చట్టం అమలులోకి వచ్చింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాడిన తర్వాత కూడా ఈ చట్టాన్ని యథావిధిగా అమలు చేస్తుంది. వ్యవసాయభూమిలో బోరు వేయడానికి, బావి తవ్వడానికి మండల తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ఈ దరఖాస్తు చేసుకునేందుకు భూగర్భశాఖ అధికారులు వచ్చి అక్కడ నీటి లభ్యత పరిశీలిస్తారు. తర్వాత విద్యుత్‌ శాఖ నుంచి కరెంట్‌ సౌకర్యం కల్పించడానికి ఇచ్చిన అనుమతి పత్రాలను వీటితో అందించాల్సి ఉంటుంది. దీని తర్వాత తహసీల్దార్‌ అనుమతి తీసుకుని బోరు వేయాల్సి ఉంటుంది. లేకుంటే బోరుపై ఫిర్యాదు చేస్తే సీజ్‌ చేసే అధికారం తహసీల్దార్‌కు ఉంటుంది.

సీజనల్‌ వ్యాధులపై నిర్లక్ష్యం చేయొద్దు

- వైద్యారోగ్యశాఖ అదనపు డైరెక్టర్‌ డాక్టర్‌ అమర్‌సింగ్‌



కాల్పోల్‌లో వివరాలు అడిగి తెలుసుకుంటున్న వైద్యారోగ్యశాఖ అదనపు డైరెక్టర్‌ అమర్‌సింగ్‌

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): సీజనల్‌ వ్యాధులపై ప్రజలు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యం చేయొద్దని వైద్యారోగ్యశాఖ అదనపు డైరెక్టర్‌ డాక్టర్‌ అమర్‌సింగ్‌ తెలిపారు. మండలంలోని కాల్పోల్‌ గ్రామాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ పరిసరాలు పరిశీలించారు. పలు ఇళ్ల పరిసరాల్లో ట్రాక్టర్‌, ట్రాలీ, హార్వెస్టర్‌ టైర్లు ఉండటాన్ని గమనించారు. అందులో నీరు నిల్వ ఉండి లార్వా స్థావరాలను ఏర్పాటు చేసుకోవడంతోనే గ్రామంలో డెంగీ కేసులు నమోదవుతున్నాయనే అంచనాకు వచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కాల్పోల్‌లో 370 మందికి చికిత్సలు అందించామన్నారు. ప్రజలందరికీ ఆరోగ్యం కుదుటపడే వరకు వైద్యశిబిరం కొనసాగించాలని తెలిపారు. ఆయన వెంట జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్‌, మెడికల్‌ ఆఫీసర్లు ప్రత్యూష, అజ్మల్‌, వైద్యసిబ్బంది ఉన్నారు.

జీజీహెచ్‌ సందర్శన..

నిజామాబాద్‌ నాగారం: డెంగీ, వైరల్‌ ఫీవర్‌ ప్రబలుతున్న నేపథ్యంలో రాష్ట్ర కీటక జనత నియంత్రణ అధికారి డాక్టర్‌ అమర్‌సింగ్‌ బుధవారం జిల్లాలో పర్యటించారు. జీజీహెచ్‌ను సందర్శించిన ఆయన డీఎంహెచ్‌వో డాక్టర్‌ రాజశ్రీని కలిశారు. సీజనల్‌ వ్యాధులపై ఆరా తీశారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో రాథోడ్‌, డాక్టర్‌ నాగరాజ్‌ ఉన్నారు.

జీజీహెచ్‌లో మొరాయించిన లిఫ్టు



లిఫ్టు నుంచి రోగులు, బంధువులను బయటకు తీసుకువస్తున్న పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రిలో బుధవారం పై అంతస్తు నుంచి కిందకు వస్తున్న లిఫ్టు మొరాయించింది. లిఫ్టు తలుపులు తెరుచుకోకపోవడంతో అందులో ఉన్న 15 మంది రోగులు, బంధువులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. సుమారు అరగంటపాటు లిఫ్టులోనే ఉండిపోయారు. రోగులు, బంధువుల ఆర్తనాదాలు విన్న సెక్యూరిటీ, పోలీసులు సిబ్బంది వచ్చి అతికష్టం మీద లిఫ్టు డోర్లు తెరిచారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

8 లిఫ్టుల్లో పనిచేసేవి రెండే..

ఏడు అంతస్తుల జీజీహెచ్‌లో సుమారు 750కి పైగా రోగులు చికిత్స పొందుతుంటారు. నిత్యం 1800లకు పైగా ఓపీ, 50 నుంచి 100 వరకు ఇన్‌పేషంట్లు వైద్య సేవలు పొందుతారు. జీజీహెచ్‌లో రోగుల కోసం నాలుగు లిఫ్టులు, వైద్యులు, ఇతర అత్యవసరాల నిమిత్తం మరో నాలుగు లిఫ్టులను ఏర్పాటు చేశారు. రోగులకు సంబంధించి లిఫ్టుల్లో రెండు మాత్రమే పనిచేస్తున్నాయి. అవి కూడా అప్పుడప్పుడూ మొరాయిస్తున్నాయి. వైద్యుల లిఫ్టుల్లోనూ రెండు పని చేస్తుండగా వాటిలో ఒకటి రోగులు, బంధువులకు మరొకటి వైద్యులు ఉపయోగిస్తున్నారు.

మరమ్మతులు చేయించాలి

కాలు నొప్పి ఉందని ఆస్పత్రికి వచ్చాను. లిఫ్టులు పని చేయకపోతే చికిత్స కోసం పైఅంతస్తులో ఉన్న డాక్టర్ల వద్దకు ఎలా వెళ్లాలి. గతంలో కూడా లిఫ్టులు ఆగిపోయాయి. అధికారులు స్పందించి వెంటనే వాటిని మరమ్మతు చేయించాలి.

– నర్సమ్మ, రోగి

అన్నింటినీ అందుబాటులోకి తెస్తాం..

లిఫ్టు మొరాయించిన విషయం తెలియగానే రోగులను సేఫ్‌గా బయటకు తెచ్చాం. మరమ్మతుల కోసం టెక్నీషియన్లకు సమాచారం అందించాం. అన్ని లిఫ్టులను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్‌ రాములు, జీజీహెచ్‌ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌

29 నుంచి ఎస్టీలకు రాజకీయ శిక్షణ తరగతులు

- కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్‌ అధ్యక్షుడు బెల్లయ్య నాయక్‌



విలేకరులతో మాట్లాడుతున్న బెల్లయ్య నాయక్‌

నిజామాబాద్‌ సిటీ: కాంగ్రెస్‌ పార్టీ ఆదివాసీ విభాగం తరపున దేశవ్యాప్తంగా రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎస్టీ సెల్‌ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లయ్య నాయక్‌ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో బుధవారం జిల్లా ఎస్టీ సెల్‌ అధ్యక్షుడు కెతావత్‌ యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బెల్లయ్య నాయక్‌ మాట్లాడారు. కాంగ్రెస్‌ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ సూచన మేరకు, పీసీసీ చీఫ్‌ మహేశ్‌ కుమార్‌ గౌడ్‌ ఆదేశాలతో రాష్ట్రంలో ఎస్టీలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 29, 30, 31 తేదీల్లో జిల్లా కేంద్రంలోని హోటల్‌ హరితలో కార్యక్రమంలో 14 అంశాల్లో వివిధ రంగాలకు చెందిన నిపుణులు పాఠాలు చెబుతారన్నారు. శిక్షణ తరగతులను జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ప్రారంభిస్తారని, 31న జరిగే ముగింపు సమావేశానికి పీసీసీ చీఫ్‌ మహేశ్‌ కుమార్‌ గౌడ్‌ హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామం నుంచి ఐదుగురు చొప్పున పాల్గొనాలని, రాజకీయ చైతన్యం పొంది కాంగ్రెస్‌ పార్టీ బలోపేతానికి సహకరించాలన్నారు. సమావేశంలో రాణాప్రతాప్‌, తారాచంద్‌ నాయక్‌, మోహన్‌ నాయక్‌, సుభాష్‌ జాదవ్‌, కెతావత్‌ ప్రకాశ్‌ నాయక్‌, బదావత్‌ సురేశ్‌ నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

జీడీపీలో మూడో అతిపెద్ద దేశంగా భారత్‌

సెస్‌ డైరెక్టర్‌, ప్రొఫెసర్‌ రేవతి



సదస్సులో ప్రసంగిస్తున్న సెస్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ రేవతి

తెయూ(డిచ్‌పల్లి): అర్థశాస్త్ర అభివృద్ధి పరిధి పెరిగి వేగం పుంజుకోవడంతో దశాబ్ద కాలంలో ప్రపంచస్థాయిలో అత్యధిక జీడీపీ కలిగిన మూడో అతి పెద్ద దేశంగా భారతదేశం అవతరించిందని సెంటర్‌ ఫర్‌ ఎకనామిక్‌ అండ్‌ సోషల్‌ స్టడీస్‌ (సెస్‌) డైరెక్టర్‌, ప్రొఫెసర్‌ రేవతి పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీ అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'ఎంపవరింగ్‌ ఇండియా –2047 స్ట్రాటజీస్‌ ఫర్‌ సస్టెయినబుల్‌ డెవలప్‌మెంట్‌' అనే అంశంపై బుధవారం ప్రారంభమైన రెండ్రోజుల జాతీయ స్థాయి ప్రారంభ సదస్సులో ప్రొఫెసర్‌ రేవతి కీలకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధితో భారత ఆర్థిక విధానాల్లో వచ్చిన చారిత్రాత్మకమైన మార్పులతో ప్రైవేటైజేషన్‌, గ్లోబలైజేషన్‌, లిబరలైజేషన్‌దాటి ఈనాటి డిజిటలైజేషన్‌ వరకు వెళ్లిందన్నారు. ఈ క్రమంలో భారత ఆర్థిక వ్యవస్థలో ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్సీ, బ్లాక్‌ చైన్‌ టెక్నాలజీ, క్లౌన్‌ టెక్నాలజీ, సైబర్‌ టెక్నాలజీలు పెరగడంతో పెట్టుబడులకు ఎల్లలు లేకుండా బహుళ జాతి కంపెనీలు ఉత్పాదకత, ఉత్పత్తిని పెంచుకుంటున్నాని అన్నారు. బ్రాంట్‌ ల్యాండ్‌ కమిషన్‌ మొదలుకొని వికసిత్‌ భారత్‌ వరకు జరిగిన అభివృద్ధి వ్యూహాలను వివరించారు. విశిష్ట అతిథిగా హాజరైన తెయూ వీసీ, ప్రొఫెసర్‌ టీ యాదగిరి రావు మాట్లాడుతూ పటిష్టమైన ఆర్థిక వ్యూహాలే భారత సుస్థిరాభివృద్ధికి మార్గాలన్నారు. దేశంలోని విస్తారమైన స్థానిక వనరులను ఉపయోగించుకొని ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాన్ని అభివృద్ధిపరిస్తే 2047 నాటికి భారత్‌ ప్రపంచ ఆర్థిక శక్తిగా నిలబడుతుందన్నారు. రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ ఎం యాదగిరి మాట్లాడుతూ 2030 నాటికి మరింత వేగం పెంచుకొని, 2047 నాటికి ప్రపంచంలో 30 ట్రిలియన్ల జీడీపీతో నెంబర్‌ వన్‌ ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్‌ మామిడాల ప్రవీణ్‌, సదస్సు కన్వీనర్‌, అర్థశాస్త్ర విభాగాధిపతి ఏ పున్నయ్య మాట్లాడుతూ ఈ సెమినార్‌కు అమెరికా, సౌత్‌ కొరియా, బ్రిటన్‌ దేశాల నుంచి ప్రామాణికమైన పత్రాలు అందడం సంతోషంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల నుంచి 140 పత్రాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో సదస్సు కోకన్వీనర్‌ టీ సంపత్‌కుమార్‌, ప్రొఫెసర్‌ రవీందర్‌ రెడ్డి, అధ్యాపకులు నాగరాజు పాత, స్వప్న, వివిధ విభాగాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పత్ర సమర్పకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పీజీ పరీక్షలు వాయిదా వేయాలి



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 31 నుంచి ఆగస్టు 13 వరకు జరిగే పీజీ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షలను వాయిదా వేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్‌ చేశారు. తెయూ ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం పరిపాలనా భవనంలోని కంట్రోలర్‌ చాంబర్‌లో బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బీ శివ మాట్లాడుతూ ఆగస్టు 4 నుంచి 11 వరకు సీపీగెట్‌ పరీక్షలు నిర్వహించే తేదీలలోనే పీజీ సెమిస్టర్‌ పరీక్షలు ఉండటంతో పీజీ ఎంట్రన్స్‌ రాసే విద్యార్థులకు ఇబ్బంది అవుతుందన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్‌ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ కే సంపత్‌కుమార్‌ హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు నిరసన విరమించారు. కార్యక్రమంలో ఏబీవీపీ స్టేట్‌ వర్కింగ్‌ కమిటీ మెంబర్‌ అమృతాచారి, వర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్‌, నాయకులు సమీర్‌, అజయ్‌, అక్షయ్‌, రాకేశ్‌, అశోక్‌, నవీన్‌, పృథ్వీ, లెనిన్‌, రోహన్‌, శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టర్‌ పున్నయ్య రచనల ఆవిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వీసీ యాదగిరి రావు, సెస్‌ డైరెక్టర్‌ రేవతి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్‌ ఏ పున్నయ్య రచించిన సంభాషణ, సమాలోచన అనే పుస్తకాలను బుధవారం వీసీ ప్రొఫెసర్‌ టీ యాదగిరి రావు, సెంటర్‌ ఫర్‌ ఎకనామిక్‌ అండ్‌ సోషల్‌ స్టడీస్‌ (సెస్‌) డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ రేవతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వర్సిటీ ఆచార్యులు తరగతి గదికి మాత్రమే పరిమితం కాకుండా సామాజిక మార్పు కోసం, సంప్రదాయ విధానాలకు భిన్నంగా విభిన్న కోణాలు ఎంచుకొని రచనలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ దిశలో తెయూ అర్థశాస్త్ర విభాగాధిపతి పున్నయ్య ప్రాథమిక స్థాయి నుంచి స్నాతకోత్తర స్థాయి వరకు బలమైన తరగతి గది నిర్మాణానికి తపన పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ ఎం యాదగిరి, ప్రిన్సిపల్‌ మామిడాల ప్రవీణ్‌, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ సంపత్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి



ఇందల్వాయి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు. గన్నారం గ్రామానికి చెందిన యావరశెట్టి గంగనర్సయ్య(60) పెట్రోల్‌ బంక్‌లో పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం విధులు ముగించుకొని టీవీఎస్‌ ఎక్సెల్‌పై ఇంటికి వస్తుండగా జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. తలకు తీవ్రగాయం కావడంతో అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి భార్య ఉమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత ..

రెంజల్‌(బోధన్‌): రెంజల్‌ గ్రామానికి చెందిన వివాహిత చికిత్స పొందుతూ బుధవారం ఆస్పత్రిలో మృతి చెందినట్లు ఎస్సై చంద్రమోహన్‌ తెలిపారు. గ్రామానికి చెందిన బేగరి సింధూజ (28) మంగళవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో గడ్డి మందు సేవించింది. గమనించిన భర్త రవితోపాటు చుట్టుపక్కల వారు నిజామాబాద్‌లో ని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న సింధూజ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందినట్లు పేర్కొన్నారు. మానసిక పరిస్థితి బాగోలేక కొంతకాలంగా చని పోతానని చెప్పుండేదని, కుటుంబీకులు కౌన్సెలింగ్‌ నిర్వహించినా ప్రవర్తనలో మార్పు రాలేదని తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. తండ్రి సురేశ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.



సింధూజ (ఫైల్‌)

బైక్‌ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య



అభినయ్‌ (ఫైల్‌)

మాక్లూర్‌: బైక్‌ కొనివ్వలేదనే మనస్తాపంతో యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని గంగరమందలో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గంగరమంద గ్రామానికి చెందిన ధాత్రిక అభినయ్‌(20) చిన్నతనంలోనే తండ్రి మృతి చెందాడు. తల్లి జమున అభినయ్‌ను తన తల్లి చంద్ర వద్ద వదిలేసి మరో వివాహం చేసుకుని వెళ్లిపోయింది. అమ్మమ్మే అన్నీ తానై అభినయ్‌ను పెంచింది. ఇంటర్‌ పూర్తి చేసిన అభినయ్‌.. ఆ తర్వాత చదువు మానేసి కూలి పనులకు వెళ్లేవాడు. ఇటీవల బైక్‌ కొనివ్వాలని అమ్మమ్మను కోరాడు. పేదరికంలో ఉన్నామని, అంత డబ్బు మనవద్దలేదని చెప్పడంతో మనస్తాపానికి గురైన అభినయ్‌ మంగళవారం సాయంత్రం నుంచి కన్పించకుండా పోయాడు. దీంతో అమ్మమ్మ ఆందోళనకు గురై వెతుకుతుండగా అదే రోజు రాత్రి సుమారు 9 గంటల సమయంలో గ్రామశివారులోని హన్మాన్‌ మందిరం వద్ద ఉన్న చెట్టుకు ఉరేసుకున్నట్లు గుర్తించారు. అమ్మమ్మ చంద్ర ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళ మెడలో నుంచి గొలుసు చోరీ

సిరికొండ: మండలంలోని పెద్దవాల్గోట్‌ గ్రామ సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారం గొలుసు ఎత్తుకెళ్లారని ఎస్సై రామకృష్ణ బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన పిట్ల నర్సవ్వ గిర్ని చౌరస్తా వద్ద బస్సు దిగి గ్రామానికి నడుచుకుంటూ వెళ్తున్నది. వెనుక నుంచి బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు పుస్తెల తాడును తెంపుకొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడికి యత్నించిన వారిపై కేసు నమోదు

ఎల్లారెడ్డి: అటవీశాఖ అధికారిపై దాడికి యత్నించిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై–2 సుబ్రహ్మణ్య చారి తెలిపారు. మండలంలోని తిమ్మారెడ్డి కట్టకింది తండాకు చెందిన కోల మోహన్‌ అటవీ ప్రాంతంలో ట్రాక్టర్‌తో అటవీ భూమిని చదును చేస్తుండగా వెల్లుట్ల బీట్‌ ఆఫీసర్‌ షేక్‌ ఆసిఫ్‌ అడ్డుకున్నారు. దీంతో మోహన్‌, అతడి భార్య దస్లీబాయి, కుమారుడు అసభ్య పదజాలంతో దూషించడంతోపాటు ఆసిఫ్‌పై దాడికి యత్నించినట్లు తెలిపారు. ఆసిఫ్‌ ఫిర్యాదు మేరకు మోహన్‌తోపాటు అతడి కుటుంబసభ్యులపై కేసు నమోదు చేశామన్నారు.

డీసీసీబీ అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకం

- ఎన్‌డీసీసీబీ చైర్మన్‌ కుంట రమేశ్‌ రెడ్డి



రెండో అంతస్తును ప్రారంభించిన రమేశ్‌రెడ్డి

సుభాష్‌నగర్‌: నిజామాబాద్‌ ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమని చైర్మన్‌ కుంట రమేశ్‌ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన కార్యాలయంలో ఇటీవల నిర్మించిన రెండో అంతస్తును రమేశ్‌ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు నిధులు సుమారు రూ.కోటీ 40లక్షల వ్యయంతో సకల వసతులతో కూడిన భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. బ్యాంకులో సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ ఉద్యోగులు, సిబ్బంది మరింత సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. గడిచిన ఏడాది కాలంలో బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్‌ స్టేట్‌ చైర్మన్‌ మార గంగారెడ్డి, ఎన్‌డీసీసీబీ వైస్‌ చైర్మన్‌ నల్ల చంద్రోశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు, సీఈవో నాగభూషణం వందే, డీసీవో శ్రీనివాసరావు, టీజీసీఏబీ జనరల్‌ మేనేజర్‌ సురేశ్‌, జీఎం లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

మంజీర తీరంలో ఇసుక లొల్లి

- సాలూరలో ఇసుక లోడ్‌ ట్రాక్టర్ల నిలిపివేత



ట్రాక్టర్‌ యజమానులతో మాట్లాడుతున్న తహసీల్దార్‌ శశిభూషణ్‌

బోధన్‌: మంజీర తీరంలో ఇసుక రవాణాపై వివాదం చోటు చేసుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు ఇసుకను ఉచితంగా అందిస్తోంది. ఈ నేపథ్యంలో సాలూర మండలం మందర్నా గ్రామ శివారులోని మంజీర నది నుంచి ఇసుక రవాణాకు రెవెన్యూ శాఖ అధికారులు అనుమతి ఇస్తున్నారు. దీంతో మండలంలోని మందర్నా, హున్సా, ఖాజాపూర్‌, సాలూర గ్రామాలకు చెందిన ట్రాక్టర్ల ఓనర్లు లబ్ధిదారులకు ఇసుకను సరఫరా చేస్తున్నారు. తాజాగా బుధవారం రెవెన్యూ డివిజన్‌ పరిధిలోని ఎడపల్లి, కోటగిరి, పోతంగల్‌, బోధన్‌ మండలాలకు చెందిన ట్రాక్టర్లు ఆయా మండలాల తహసీల్దార్ల నుంచి అనుమతి పత్రాలు తీసుకొని మందర్నా శివారులోని మంజీర నుంచి ఇసుకను తీసుకెళ్తున్నారు. ఇతర మండలాల ట్రాక్టర్లకు అధికారులు అనుమతి ఇవ్వడంతో వివాదం చోటు చేసుకుంది. సాలూర వద్ద ఇతర మండలాల ట్రాక్టర్లను స్థానిక ట్రాక్టర్‌ యజమానులు అడ్డుకున్నారు. సాలూర తహసీల్దార్‌ శశిభూషణ్‌, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాక్టర్‌ యజమానులతో మాట్లాడారు. ఇసుక లోడ్‌తో ఉన్న ట్రాక్టర్ల డ్రైవర్ల వద్ద అనుమతి పత్రాలను పరిశీలించారు. ఇతర మండలాల ట్రాక్టర్లకు అనుమతిపై ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్‌ తెలిపారు. దీంతో తాత్కాలికంగా వివాదం సద్దుమణిగింది.